# ఊకల్ క్రాస్ వద్ద ప్రమాదకరంగా బురద

## రంగంలోకి దిగిన గీసుగొండ పోలీసులు

**రహదారిపై పేరుకుపోయిన మట్టితో వాహనదారుల విలవిల**

**తక్షణమే స్పందించి జాతీయ రహదారిని శుభ్రం చేయించిన ఎస్‌హెచ్‌ఓ విశ్వేశ్వర్, ఎస్సై అనిల్**

**లారీ అసోసియేషన్ నిర్లక్ష్యంపై పోలీస్ శాఖ సీరియస్.. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక**



రోడ్డుమీద పేరుకుపోయిన మట్టిని పారాతో చెక్కుతున్న సీఐ విశ్వేశ్వర్



రహదారి ప్రక్కన ఉన్న మట్టి ని డోజర్ తో తొక్కిస్తున్న దృశ్యం



వెంటనే స్పందించి సీఐ విశ్వేశ్వర్ ఎస్సై అనిల్ లు రోడ్డుమీద ఉన్న మట్టిని తొలగిస్తున్న దృశ్యం



రోడ్డుమీద పేరుకుపోయిన మట్టిని తొలగించాలని వేడుకొంటున్న వాహనదారులు.



వరంగల్ నర్సంపేట రహదారిపై మట్టి వుండడంతో దిచేక్ర వాహనదారులు కిందపడ్డ దృశ్యం

**గీసుగొండ/జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని ఊకల్ క్రాస్ వద్ద వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై ఏర్పడిన బురద కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లారీ అసోసియేషన్‌కు చెందిన లారీలు పార్కింగ్ ఏరియా నుంచి ఒకేసారి రోడ్డుపైకి రావడంతో చక్రాలకు ఉన్న మట్టి అంతా జాతీయ రహదారిపై చేరింది. కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి కాస్తా బురదగా మారి కిలోమీటర్ల మేర రహదారి ప్రమాదకరంగా తయారైంది.

ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు జారిపడి ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదకర పరిస్థితిపై సమాచారం అందుకున్న వెంటనే గీసుగొండ పోలీస్ స్టేషన్ సీఐ విశ్వేశ్వర్, ఎస్సై అనిల్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.

స్థానిక లారీ అసోసియేషన్ ప్రతినిధులు, లారీ డ్రైవర్లు, గ్రామస్థులను సమన్వయం చేసుకుంటూ రోడ్డుపై పేరుకుపోయిన భారీ మట్టి, బురదను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు గంటన్నర పాటు శ్రమించి రహదారిని శుభ్రం చేయించడంతో వరంగల్-నర్సంపేట మార్గంలో వాహనాల రాకపోకలు మళ్లీ సజావుగా సాగాయి. పోలీసుల సకాలంలో స్పందించడం వల్ల పెద్ద ప్రమాదాలు తప్పాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ విశ్వేశ్వర్ మాట్లాడుతూ లారీ యజమానులు, డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాహనాలను పార్కింగ్ స్థలాల నుండి రోడ్డుపైకి తెచ్చే సమయంలో మట్టి రహదారిపై పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రహదారులపై ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎక్కడ కనిపించినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై అనిల్ విజ్ఞప్తి చేశారు.